క్లుప్తంగా

మెనూ విధిగా పాటించాలి



పాన్‌గల్: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంఈఓ శ్రీనివాసులు హెచ్‌ఎంలకు సూచించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు తెల్లరాళ్లపల్లితండా, తెల్లరాళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్‌లో సీటు



పాన్‌గల్: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్–సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(పీహెచ్‌డీ) ప్రవేశ పరీక్షలో మండల కేంద్రానికి చెందిన జీఎం ఇమ్రాన్ ఉత్తీర్ణత సాధించాడు. దేశ వ్యాప్తంగా 334వ ర్యాంక్, ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 43వ ర్యాంక్ సాధించి నవసరి వ్యవసాయ విశ్వవిద్యాలయం, గుజరాత్‌కు ఎంపికయ్యాడు. వ్యవసాయ శాఖలో మూడేళ్లపాటు పరిశోధన చేయాల్సి ఉంటుందని ఇమ్మాన్ తెలిపాడు. మంచి ర్యాంకు సాధించి వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సీటు సాధించడంపై కుటుంబ సభ్యులు, స్థానికులు అభినందించారు.

బీరప్ప బండారు ఉత్సవం

ఆత్మకూర్: పట్టణంలో బుధవారం బీరప్ప దేవర బండారు ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఐదేళ్లకో పర్యాయం నిర్వహించే దేవర్ల ఉత్సవాన్ని కురుమలు నియమనిష్టలతో జరుపుకొంటారు. కుర్వడోళ్ల చప్పుళ్లతో దేవర్లను ఆలయానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. బీరప్ప పటం వేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బంగారంగా కొలిచే పసుపును బండారుగా ఒకరిపై ఒకరు చల్లుకుని మొక్కులు తీర్చుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, కౌన్సిలర్ మహేశ్వరి పాల్గొని పూజలు నిర్వహించారు.

అదుపుతప్పి లారీ బోల్తా



కొత్తకోట రూరల్: మండలంలోని విలియం కొండ ఎన్‌హెచ్ 44పై లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. నాగపూర్ నుంచి బిస్కెట్ల లోడ్‌తో బెంగుళూర్ వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడగా.. డ్రైవర్ రూపేసింగ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

మామిడిమాడ పాఠశాల విద్యార్థి ప్రతిభ



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో క్లాస్‌మేట్ క్లబ్ వారు నిర్వహించిన జనరల్ నాలెడ్జ్ పరీక్షలో మామిడిమాడ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి శ్యామ్ ప్రథమ స్థానంలో నిలిచాడని పాఠశాల హెచ్‌ఎం చెన్నప్ప తెలిపారు. బుధవారం ఉదయం నిర్వహించిన ఈ పరీక్షలో పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న శ్యామ్ ఇంగ్లిష్ మీడియంలో ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతి గెలుపొందాడని పేర్కొన్నారు. విద్యార్థిని హెచ్‌ఎంతో పాటుగా పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

'కార్మికుల పక్షాన పోరాడుతాం'

పాన్‌గల్: సంగారెడ్డి జిల్లాలో ఈనెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు సీపీఎం రాష్ట్ర నాల్గో మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ నాయకులు వెంకటయ్య, నిరంజన్, బాలకిష్టయ్య అన్నారు. బుధవారం మండలంలోని రేమద్దులలో మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మహాసభలో చర్చించి కార్యచరణను ప్రకటిస్తారన్నారు. ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు, కర్షకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలన్నారు.





కిష్టంపల్లిలో మాట్లాడుతున్న డీపీఓ సురేష్‌కుమార్



పాన్‌గల్ మండలం రేమద్దులలో..



వల్లభాపురంలో..

'అర్హులు ఆందోళన చెందొద్దు'

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న 4 సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలో పేర్లు రాని వారు ఆందోళన చెందొద్దని ఎమ్మెల్యే మేఘారెడ్డి, డీపీఎం సురేష్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రెండో రోజు బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునే ప్రక్రియ నేటితో ముగిసేది కాదని, నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా కల్పించారు.

● వనపర్తి మండలంలో సవాయిగుడెం, కిష్టగిరి గ్రామాల్లో జరిగిన గ్రామసభలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. రైతు భరోసా, భూమి లేని నిరుపేదలకు అందించే ఆత్మీయ భరోసా రూ.12 వేలు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు రాని అర్హులైన వారు గ్రామసభలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండలంలోని పెద్దతండా (ఆర్), నాగమ్మతండా, కీర్యాతండా, తూర్పుతండా, కందిరీయతండా, మెంటిపల్లి గ్రామాల్లో ప్రత్యేక అధికారులు గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు కిచ్చారెడ్డి, శంకర్‌నాయక్, ఎంపీడీఓ రాఘవ, తహసీల్దార్ రమేష్‌రెడ్డి, ఆర్‌ఐలు మధుసూదన్, వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

● అమరచింత మండలంలోని కిష్టంపల్లి, పాంరెడ్డిపల్లి, మిట్టనందిమళ్ల, మస్తీపురం, నాగల్‌కడ్మూర్‌లో నిర్వహించిన గ్రామసభల్లో మండల స్పెషల్ ఆఫీసర్, డీపీఓ సురేష్‌కుమార్ పాల్గొని పథకాల లబ్ధిదారుల జాబితాను ప్రకటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీఓ నరసింహులు, డీటీ రెడ్యానాయక్, ఏఓ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



సోళీపురం మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటాచారి

● మదనాపురం మండలంలోని అజ్జకొల్లు, దుప్పల్లి, గోపన్‌పేట, గోవిందహళ్లి, కరివెన, కొన్నూరు, మదనాపురం, తిర్మలాయపల్లిలో గ్రామసభలు నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లకు 182, రేషన్ కార్డులకు 338, రైతు భరోసాకు 33, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 106 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ ప్రసన్నకుమారి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్రహం లింకన్ పాల్గొన్నారు.

● కొత్తకోట మున్సిపల్ కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల వద్ద 4, 5, 6 వార్డులకు ప్రజాపాలన నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ రవిందర్‌రెడ్డి, చైర్‌పర్సన్ సుకేశిని, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీనివాసులు, విశ్వేశ్వర్, సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్, కౌన్సిలర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ పీజే బాబు, ఎస్‌జే బోయేజ్, సబిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

● పాన్‌గల్ మండలంలోని చింతకుంట, కిష్టాపూర్ తండా, కొత్తపేట, మాధరావుపల్లి, మల్లాయిపల్లి, రేమద్దుల, వెంగళాయిపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి సంక్షేమ పథకాల జాబితా వివరాలను వెల్లడించారు. రేమద్దుల, కిష్టాపూర్‌తండా గ్రామాల్లో సంక్షేమ పథకాలలో పేర్లు రాని వారు అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో ఏఓ రాజవర్ధన్‌రెడ్డి, డీటీ అశోక్‌నాయుడు, ఎంపీఓ రఘురాములు, ఆర్‌ఐలు మహేష్, తిరుపతయ్య, వ్యవసాయశాఖ ఏఈఓలు, పంచాయితీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● వీపనగండ్ల మండలంలోని వల్లభాపురం, తూంకుంట, గోవర్ధనగిరి, వల్లభాపురంతండా, కల్వరాల గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం 1,082 మంది, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 376 మంది, రేషన్‌కార్డుల కోసం 889 మందిని గుర్తించి గ్రామసభల్లో వారి పేర్లు ప్రకటించినట్లు గ్రామ తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ నర్సింహులు, ఏఓ డాకేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● ఖిల్లాఘనపురం మండలంలోని అల్లమాయపల్లి, అంతాయపల్లి, సోళీపురం, దొంతికుంటతండా, పర్వతాపురం, ఈర్లతండా, వెంకటాంపల్లి, కోతులకుంటతండా, మామిడిమాడ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. తొమ్మిది గ్రామాల్లో రేషన్ కార్డుల కోసం 352, ఆత్మీయ భరోసాకు 68, ఇందిరమ్మ ఇళ్ల కోసం 101, రైతు భరోసాకు ఒకటి కలిపి మొత్తం 522 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ వెంకటాచారి తెలిపారు. గ్రామసభల్లో తహసీల్దార్ సుగుణ, ఏఓ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మకూర్ మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మున్సిపాలిటీలోని 6 నుంచి 10 వార్డుల్లో ప్రజాపాలన సభలను నిర్వహించి లబ్ధిదారుల జాబితాను ప్రకటించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సుబ్బారెడ్డి, తహసీల్దార్ చాంద్‌పాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, కమిషనర్ శశిధర్, ఎంపీడీఓ ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి, ఏఓ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

● కొత్తకోట మండలంలోని వడ్డెవాటతండా, సంకిరెడ్డిపల్లి, అప్పరాల, సత్యహళ్లి, పామాపూర్‌లో అధికారులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. పామాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల జాబితాను చదువుతున్న అధికారులకు ప్రజల నుంచి వ్యతిరేకత ఎదురైంది. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



మదనాపురంలో..



మెంటెపల్లిలో..



మల్లాయిపల్లిలో..



వడ్డెవాటతండాలో..

ఇంగ్లిష్‌పై ఉపన్యాస పోటీలు



వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రంలోని బాల భవన్‌లో ఆంగ్ల భాష ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం అధునాతన విద్యా విధానంలో విద్యార్థులు ఆంగ్లభాషలో ఎలా పట్టు సాధించాలి అనే అంశంపై ఒలంపియాడ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా వనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర పాఠశాలకు చెందిన 8వ తరగతి చదువుతున్న బిపిన్ చంద్ర ఒలంపియాడ్ పోటీలో మొదటి స్థానంలో నిలిచాడు. విద్యార్థికి ఉపాధ్యాయురాలు నాగజ్యోతి రూ.500 నగదు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గురురాజుయాదవ్, ఇంగ్లిష్ ఉపాధ్యాయులు నాగరాజు, నాగజ్యోతి, హెప్సిబా, శివారెడ్డి, సాయిబాబా, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



వనపర్తి రూరల్: సంగారెడ్డిలో ఈ నెల 25 నుంచి 28 వరకు జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి కోరారు. బుధవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన పట్టణ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలకు ముఖ్యవక్తలుగా పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకారత్, బీవీ రాఘవులు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి తమ్మినేని వీరభద్రం, చుక్కా రాములు, చెరుకుపల్లి సీతారాములు పాల్గొంటారని చెప్పారు. 700 మంది ప్రతినిధులతో మహాసభలు ప్రారంభమవుతాయని.. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ముఖ్యమైన తీర్మానాలు ప్రవేశ పెడతారని వివరించారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రైతులకు పంట రుణమాఫీ రెండు లక్షలు పూర్తిస్థాయిలో కాలేదని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ సభ్యులు కురుమయ్య, బాలస్వామి, రమేష్, గంధం గట్టయ్య, రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం



దుప్పల్లి మూడో అంగన్‌వాడీ కేంద్రంలో..



అజ్జకొల్లు అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ లక్ష్మమ్మ

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లు 2వ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఆత్మకూర్ సీడీపీఓ లక్ష్మమ్మ చిన్నారులతో అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేయించారు. చిన్నారులకు పలకలపై అక్షరాలు పెట్టి దిద్దించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ ప్రభుత్వం ద్వారా వస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దుప్పల్లి మూడో అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ తారమ్మ మూడు నుంచి ఆరేళ్ల ఏళ్ల వయస్సు గల 15 మంది చిన్నారులకు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సావిత్రమ్మ చేతుల మీదుగా యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భారతమ్మ, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మమ్మ, ఈశ్వరమ్మ, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు



సల్కెలాపురంలో దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న మాలధారులు



అమరచింతలో..

అమరచింత: అయోధ్యలో బాలరాముడి విగ్రహం ప్రతిష్ఠించిన రోజును పురస్కరించుకుని మండల కేంద్రంలోని రామాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందువులు తమ ఇళ్ల ముంగిట దీపాలను వెలగించి శ్రీరాముడిని ఆరాధించారు. ఏళ్లుగా కలలు కన్న రామాలయం ఆలయ నిర్మాణం పూర్తవ్వడంతో పాటు బాలరాముడిని ఆలయంలో ప్రతిష్ఠించి పూజలు చేసుకునే భాగ్యం కలగడం అదృష్టమని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు తెలిపారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని సల్కెలాపురం గ్రామంలో బుధవారం రాత్రి శివ మాలధారులు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్యలో రామ మందిరం ప్రారంభించి నేటికి సంవత్సరం కావస్తుండటంతో మాలధారులు ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో జై శ్రీరాం అనే అక్షరాల మాదిరి దీపాలు వెలిగించారు.

వార్డు సభల్లో గందరగోళం



అమరచింత 5 వవార్డులో అధికారులను నిలదీస్తున్న వార్డు ప్రజలు

అమరచింత: ప్రభుత్వం ప్రవేశపెట్టిన 4 సంక్షేమ పథకాలను అర్హులైన వారి జాబితాను వెల్లడించేందుకు ఏర్పాటు చేసిన వార్డు సభలు బుధవారం గందరగోళంగా మారాయి. 5, 8 వార్డుల్లో జరిగిన సభలను ప్రజలు అడ్డుకోవడంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. మూడు, ఏడు, పదో వార్డుల్లో అధికారులు అర్హుల జాబితాను ప్రకటించినా.. అవి సైతం తప్పుల తడకగా ఉన్నాయని ప్రజలు అధికారులపై మండిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల మంజూరు జాబితాలో పేర్లు లేని వారు మున్సిపల్ కార్యాలయానికి పరుగులు తీశారు. మరోమారు దరఖాస్తు పెట్టుకోవాలని కమిషనర్ చెప్పడంతో చేసేది లేక కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో చైర్‌పర్సన్ పేరు

ఇందిరమ్మ ఇంటి మంజూరు జాబితాలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ పేరు ఉండటంతో వార్డు సమావేశానికి వచ్చిన ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు. ఇళ్లు లేని వారికి ఇళ్లను ఇప్పించే హోదాలో ఉన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఏకంగా తనే పేద తరగతికి చెందిన వ్యక్తిగా ఇందిరమ్మ ఇంటిని రాసుకోవడం ఏమిటని అక్కడికి వచ్చిన ప్రజలు చైర్‌పర్సన్‌ను నిలదీయడంతో మౌనం వహించారు. ఇది తనకు తెలియదని తన పేరును తొలగించుకుంటానని చెప్పిన ప్రజలు వినక పోవడంతో సమావేశం నుంచి వెళ్లిపోయారు.

అందుబాటులో భాస్వరం జీవన ఎరువు

పాన్‌గల్: మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో భాస్వరం జీవన ఎరువు అందుబాటులో ఉన్నట్లు ఏఓ రాజవర్ధన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఆహార భద్రత పథకం కింద భాస్వరం కరిగించే బాక్టీరియా(పీఎస్‌బీ) 50 శాతం సబ్సిడీపై అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కిలో రూ.20 చెల్లించి పొందవచ్చన్నారు. ఈ జీవన ఎరువు అన్ని పంటలకు వాడొచ్చని, ఎకరాకు 2 కిలోలు భూమిలో తగిన తేమ ఉన్నపుడు ఈ ఎరువు వేసుకోవాలని ఏఓ రైతులకు సూచించారు.

బీరం సుబ్బారెడ్డిపై చర్యలకు డిమాండ్

వనపర్తి: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారిపైన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి బుధవారం బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయదేవిని కలిసి ఫిర్యాదు చేశారు. 2016లో నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొండనాగుల హాస్టల్ హెచ్‌డబ్ల్యూఓగా పనిచేస్తున్న సమయంలో 150మంది విద్యార్థులకు అన్యాయం చేశాడని ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారని గుర్తుచేశారు. ఆ కేసు పెండింగ్‌లో ఉండగా ఉన్నతాధికారులను మభ్యపెట్టి డబ్బులు ఇచ్చిన వనపర్తి జిల్లాకు ఏబీసీడబ్ల్యూఓగా బదిలీ ద్వారా వచ్చి నియమితులయ్యారని, ఇన్‌చార్జీ డీబీసీడబ్ల్యూఓగా జిల్లాలోని 15 హాస్టళ్లకు, ట్రైబర్ వెల్ఫేర్ ఇన్‌చార్జీగా నియమించడబద్దారని ఇలాంటి అధికారి విద్యార్థులకు ఎలా న్యాయం చేస్తాడని ప్రశ్నించారు. అతడిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. బీసీ సంక్షేమ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన వారిలో పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సైదులు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు గణేష్, రాకేష్, బీచుపల్లి, సిద్దార్థరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

కోడేరు: మండలంలోని నార్యానాయక్ తండా, సింగాయిపల్లి తండా, గుండ్యావాల్యానాయక్ తండా, ఒప్పితండాలో జిల్లా ఎక్సైజ్ అధికారి గాయత్రి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 400 లీటర్ల బెల్లం పానకం, 60 కిలోల నల్లబెల్లం, 10 లీటర్ల సారాను ధ్వంసం చేసి కేసులు నమోదు చేశారు. మండలంలో ఎవరైనా సారా అమ్మితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సంక్షేమం నిరంతర ప్రక్రియ



జిల్లాకేంద్రంలోని 14వ వార్డు సభలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి.. చిత్రంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తదితరులు

వనపర్తి టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. సంక్షేమ పథకాల అమలుకు నిర్వహిస్తున్న గ్రామసభల రెండోరోజు బుధవారం వనపర్తి పురపాలిక 14వ వార్డు బ్రహ్మంగారి వీధిలో జరిగిన వార్డు సభకు ఆయనతో పాటు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా ఈ నెల 16 నుంచి 20 వరకు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హుల జాబితాను సిద్ధం చేశారని తెలిపారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలున్నా.. ఇంకా అర్హులెవరైనా ఉన్నారా అనే విషయాలను ప్రజల సమక్షంలో తెలుసుకోడానికి 24వ తేదీ వరకు గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీకి రూపొందించిన జాబితాను గ్రామసభలో అధికారులు చదివి వినిపిస్తారని.. అనర్హులుంటే అభ్యంతరం చెప్పాలని, తొలగిస్తామన్నారు. అదేవిధంగా అర్హత కలిగి ఉండి పేర్లు లేని వారు తిరిగి దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి మంజూరు చేస్తామని చెప్పారు. ఇది నిరంతర ప్రక్రియని.. గ్రామసభలో లేదా ప్రజాపాలన సేవాకేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక..

ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు పార్టీలకతీతంగా అత్యంత పారదర్శకంగా నిజమైన ప్రతి లబ్ధిదారునికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మేఘారెడ్డి తెలిపారు. బుధవారం జిల్లాకేంద్రంలోని 20, 21 వార్డుల్లో జరిగిన సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. జనవరి 26న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల పంపిణీ సంక్షేమ పథకాలు ప్రారంభిస్తారని చెప్పారు. ఈ పథకాలు అర్హులకే అందేందుకు గ్రామసభలు నిర్వహిస్తూ ప్రజల ఆమోదంతో తుదిజాబితా రూపొందిస్తున్నామని తెలిపారు. జాబితాలో పేర్లు లేవని దిగాలు చెందాల్సిన అవసరం లేదని.. గ్రామసభలో లేదా ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 14వ వార్డులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చదివిన పాఠశాల ఉందని.. రూ.70 కోట్లతో అభివృద్ధి చేసేందుకు త్వరలో రానున్నారని వివరించారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ.. అర్హులకే సంక్షేమ పథకాలు అందాలని గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే గ్రామసభలోనే చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సుబ్రమణ్యం, పుర కమిషనర్ పూర్ణచందర్, మున్సిపల్ చైర్మన్ పుట్టపాగ మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ బ్రహ్మచారి, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

గ్రామానికి చేరుకున్న ఈదమ్మ విగ్రహం



కొల్లాపూర్: మహాబలిపురంలో కృష్ణశిలతో తయారుచేయించిన ఈదమ్మ దేవత విగ్రహాన్ని బుధవారం కొల్లాపూర్‌కు తీసుకువచ్చారు. పట్టణంలో ఈదమ్మ దేవత నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని మాధవస్వామి దేవాలయంలో విగ్రహాన్ని నవధాన్యాలతో కప్పి ఉంచారు. శివస్వాములు దేవతామూర్తి విగ్రహానికి సంప్రదాయ పూజలు చేశారు. ఈ నెల 29న సప్తనదుల జల కలశాలతో దేవతామూర్తి విగ్రహాన్ని ఊరేగింపుగా ఈదమ్మ గుడి వద్దకు తీసుకువెళ్లనున్నట్లు విగ్రహ ఏర్పాటు కమిటీ నాయకులు వెల్లడించారు. మూడు రోజుల పాటు విగ్రహ పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.